www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం మే 24 2024



కట్టుదిట్టమైన భద్రత నడుమ కౌంటింగ్ ప్రక్రియ

మూడంచెల భద్రత ఏర్పాటు : కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జూన్ 4వ తేదీన జరగనున్న సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియకు ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్ కుమార్ మీనా పేర్కొన్నారు. గురువారం సార్వత్రిక ఎన్నికలు -2024 కౌంటింగ్ ప్రక్రియ సన్నద్ధతపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వెలగపూడి సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు జిల్లా కలెక్టర్ ఎస్.షణ్మోహన్ క్యాంప్ ఆఫీస్ నుండి పాల్గొన్నారు. అలాగే జిల్లా సచివాలయం నుండి పలమనేరు, జిడి నెల్లూరు ఆర్‌ఓలు మనోజ్ రెడ్డి, వెంకట శివలు, ట్రైనీ కలెక్టర్ హిమ వంశీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ జూన్ 4న చేపట్టనున్న సాధారణ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లను చేపట్టాలని, ఎన్నికల సిబ్బంది ర్యాండమైజేషన్, ట్రైనింగ్ పూర్తి చేయాలని తెలిపారు. ఈవిఎంలు, పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ప్రక్రియను అత్యంత జాగ్రత్తగా నిర్వహించాలని తెలిపారు. స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ హాల్‌ల వద్ద సిసి కెమెరాల ద్వారా నిరంతర పర్యవేక్షణ ఉంచాలన్నారు.

జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ... కౌంటింగ్ ప్రక్రియకు సంబంధించి కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయడం జరిగిందని, కౌంటింగ్ సెంటర్ వద్ద మూడంచెల భద్రత ఏర్పాట్లలో భాగంగా మొదటి వలయంలో సిఏపిఎఫ్ సిబ్బంది, రెండవ వలయంలో ఎస్‌ఏపిఎఫ్, మూడవ వలయంలో సివిల్ పోలీసులతో భద్రత ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 64 సిసి కెమెరాలతో కౌంటింగ్ ప్రక్రియను కంట్రోల్ రూమ్‌ల నుంచి నిరంతర పర్యవేక్షణ చేయడం జరుగుతుందన్నారు. ప్రతి అసెంబ్లీ, పార్లమెంట్ సెగ్మెంట్‌లకు విడివిడిగా ఈవిఎం కౌంటింగ్ కొరకు ప్రతి నియోజకవర్గానికి 14 టేబుళ్లు ఏర్పాటు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

చేయడం జరిగిందన్నారు. ఈనెల 25న సిబ్బంది మొదటి ర్యాండమైజేషన్ నిర్వహించి, 28న మొదటి శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పోస్టల్ బ్యాలట్ కౌంటింగ్‌లో భాగంగా అసెంబ్లీ నియోజకవర్గానికి 3 టేబుళ్లు, పార్లమెంట్ నియోజకవర్గానికి 18 టేబుళ్లు ఏర్పాటు చేయడం జరిగిందని కలెక్టర్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కి వివరించారు.

స్ట్రాంగ్ రూముల వద్ద అనునిత్యం అప్రమత్తంగా ఉండాలి

పక్కాగా ఏర్పాట్లు: జెసి



స్ట్రాంగ్ రూమ్ ఏర్పాట్లు పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

స్ట్రాంగ్ రూముల వద్ద అనునిత్యం 24/7 అప్రమత్తంగా ఉండాలని జిల్లా జాయింట్ కలెక్టర్, 172- చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి పి.శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం మురకంబట్టు సమీపంలోని ఎస్‌విసెట్‌లో సాధారణ ఎన్నికల దష్త్వా ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములను, కౌంటింగ్ కేంద్రాలను, పోస్టల్ బ్యాలెట్, మీడియా సెంటర్ ఏర్పాటు, సిఅండ్ డి స్ట్రాంగ్ రూములను జిల్లా జాయింట్ కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు -2024కు కౌంటింగ్ కేంద్రంగా ఉన్న ఎస్‌వి సెట్ స్ట్రాంగ్ రూముల వద్ద భద్రతపరంగా 24/7 అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. కౌంటింగ్ వరకు అనునిత్యం అప్రమత్తంగా ఉంటూ గట్టి బందోబస్తు నిర్వహించాలన్నారు. పుంగనూరు, నగరి, జీడి నెల్లూరు, చిత్తూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం అసెంబ్లీ, పార్లమెంటు నియోజకవర్గాలకు విడివిడిగా కౌంటింగ్‌కు సంబంధించిన చేసిన ఏర్పాట్లును పరిశీలించి పక్కాగా బ్యారికేడింగ్ వ్యవస్థ ఉండాలన్నారు. పంచాయతీ రాజ్, ఆర్ అండ్‌బి అధికారులు సమన్వయంతో బ్యారికేడింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయాలన్నారు. పూతలపట్టు రిటర్నింగ్ అధికారి చిన్నయ్య, చిత్తూరు మునిసిపల్ కమిషనర్ అరుణ, మెటీరియల్ మేనేజ్మెంట్ నోడల్ అధికారి షణ్ముగం, చిత్తూరు తహశీల్దార్ శ్రీనివాసులు రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఏనుగుల గణన

ప్రజాశక్తి చిత్తూరుఅర్బన్

ఈనెల 25వ తేదీ శుక్రవారం నుండీ దక్షిణ భారతదేశ వ్యాప్తంగా ఏనుగుల గణన చేపట్టనున్నట్లు జిల్లా అటవీశాఖాధికారి చైతన్య కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ గణన జిల్లాలో మూడు రోజుపాటు జరుగుతుందని గతంలో నిర్వహించిన సర్వే ప్రకారం జిల్లాలో వంద ఏనుగులు ఉన్నట్లు గుర్తించామన్నారు. ఈ ఏడాది ప్రమాద బారిన 6 ఏనుగులు చనిపోయిన్నట్లు తెలిపారు. ప్రస్తుత సర్వేలో జిల్లాలో ఎనుగుల సంఖ్య ఖచ్చితంగా తెలిసే అవకాశముందన్నారు. ఈ సర్వే సౌత్ ఇండియాలో ఏపీ, తమిళనాడు, కర్ణాటక, కేరళలో చేపడుతున్నట్లు తెలిపారు. అటవీ ప్రాంత సరహద్దు గ్రామాల్లో ప్రజలు సర్వేకు సహకరించాలని సర్వే సందర్భంగా ఎనుగులకు ఇబ్బంది కలిగించే ఎలాంటి చర్యలకు పాల్పడవద్దని సూచించారు.



డిఎఫ్‌ఒ చైతన్యకుమార్‌రెడ్డి

పెట్రోల్, డీజిల్ బాటిల్స్‌లో పట్టొద్దు : జెసి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: పెట్రోల్, డీజల్‌ను క్యాన్స, బాటిల్స్, డ్రమ్స్‌లో పట్టారాదని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లోని జెసి సమావేశం హాల్‌లో డిఎస్‌ఓ శంకరన్‌తో కలసి పెట్రోల్ డీజిల్ క్యాన్స, బాటిల్స్, డ్రమ్స్‌లో పట్టరాదన్న అంశంపై జిల్లాలోని పెట్రోల్ బంక్స్ యజమానులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జెసి మాట్లాడుతూ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఉత్తర్వుల మేరకు ఎన్నికల నియమాలు ఉన్నందున చిత్తూరు జిల్లాలోని పెట్రోల్ బంకుల యజమానులందరూ ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తి అయ్యేంత వరకు, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు ఏ ఒక్క పెట్రోల్ బంక్ నుండి పెట్రోల్, డీజిల్‌ను డ్రమ్స్, క్యాన్స్, బాటిల్స్‌లో పట్టారాదని తెలిపారు. ఎవ్వరైనా అతిక్రమిస్తే కఠిన చర్యలతో పాటుగా పెట్రోల్ బంక్ లైసెన్స్ రద్దు చేయడం జరుగుతుందన్నారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుండి పెట్రోలు డీజిల్ తీసుకొచ్చి ఇక్కడ అధిక రేట్లకు అమ్మితే అలాంటి వారిపై క్రిమినల్ కేసులు పెట్టడం జరుగుతుందన్నారు. సమావేశంలో పౌరసరఫరాల శాఖ ఏఎస్‌ఓ శివరామరాజు, పెట్రోల్ బంకుల యజమానులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్



రోదిస్తున్న కుటుంబీకులు



న్యాయం చేయాలంటూ మెగా సంస్థ ముందు కార్మికుల ఆందోళన

'మెగా' కార్మికుడు మృతి

- విధి నిర్వహణలోనే గుండెపోటు
- న్యాయం చేయాలని కార్మికుల ఆందోళన
- రూ.లక్ష ఇచ్చి చేతులు దులుపుకున్న సంస్థ
- ఆలస్యంగా వెలుగులోకొచ్చిన వైనం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

ఒరిస్సా రాష్ట్రానికి చెందిన మెగా కార్మికుడు విధుల్లో ఉండగానే గుండెపోటుతో మృ చెందిన సంఘటన తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలో ఆలస్యంగా వెలుగు చూసింది. మతుడికి న్యాయం చేయాలంటూ అదే రాష్ట్రానికి చెందిన మెగా కార్మికులు శ్రీకాళహస్తి పట్టణ శివారు ప్రాంతంలో ఉన్న మెగా బేస్ క్యాంపు వద్ద గురువారం ఆందోళనకు దిగారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.

ఒరిస్సా రాష్ట్రానికి చెందిన సుభాష్ చంద్ర మహపత్రి(54) గత కొన్నేళ్లుగా హైడ్రా క్రేన్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో ఆయన నాయుడుపేట-మదనపల్లి జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా శ్రీకాళహస్తి ప్రాంతంలో గత కొన్ని నెలలుగా అవిరామంగా పనిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం విధుల్లో ఉండగా ఛాతిలో తీవ్ర నొప్పి రావడంతో అక్కడికక్కడే కూలిపోయి తుది శ్వాస విడిచాడు. అయితే విధుల్లో ఉండగానే కార్మికుడు సుభాష్ చంద్ర మహపత్రి గుండెపోటుతో మరణించాడన్న వార్త బయటకు పొక్కకుండా మెగా యాజమాన్యం చర్యలు తీసుకున్నట్లు సమాచారం. కాగా తోటి కార్మికుడు గుండెపోటుతో మతి చెందడం తీవ్రంగా కలిచివేయడంతో ఒరిస్సా కార్మికులు గురువారం ఉదయం పెద్ద ఎత్తున మెగా బేస్ క్యాంపు చేరుకుని ఆందోళనకు దిగారు. నిరుపేద అయిన సుభాష్ చంద్ర కుటుంబానికి పరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. దీంతో గుండె పోటుతో మెగా కార్మికుడు మృతి చెందిన సంఘటన ఎట్టకేలకు బయటకు పొక్కింది.

రూ.లక్ష ఇచ్చి చేతులు దులుపుకున్న 'మెగా'

మెగా సంస్థలో పనిచేసే రెగ్యులర్, ఒప్పంద కార్మికులకు ఆ సంస్థ ఆరోగ్య, జీవిత, ప్రమాద బీమా కల్పించాల్సి ఉంటుంది. అంతేకాకుండా పనిచేసే సమయంలో కార్మికులు ప్రమాదాలబారిన పడకుండా, దుమ్ము, దూళి వల్ల దీర్ఘకాలిక శ్వాసకోశ సంబంధిత రోగాల బారిన పడకుండా తగిన రక్షణ ఏర్పాట్లు చేయాల్సి ఉంటుంది. అయితే మెగా సంస్థ కార్మికుల ఆరోగ్య, జీవిత ప్రమాద రక్షణ పై తగిన చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. కార్మికుల చేత అదనపు పని గంటలు చేయించుకుంటూ పీఏఫ్ వసతి కల్పించడం లేదని కార్మికులు చెప్తున్న పరిస్థితి. కార్మికులకు వ్యక్తిగత ఇన్సూరెన్సులు కాకుండా, గ్రూపు ఇన్సూరెన్సులు చేస్తూ ఆ ఇన్సూరెన్స్ ల మొత్తాన్ని కార్మికులకు తెలియకుండా దాస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. ఏదైనా కార్పొరేట్ సంస్థలో పనిచేస్తూ విధుల్లో ఉండగానే కార్మికుడు చనిపోతే తక్షణ పరిహారంగా ఆ సంస్థ ఆ కార్మికుడు కుటుంబానికి కనీసం రూ.25 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. అంతేకాకుండా అతను వలస కార్మికుడు. అయితే మతదేహాన్ని స్వస్థలానికి చేర్చడంతోపాటు అంత్యక్రియలకు సైతం నగదు సాయం ఆ సంస్థ చేయాల్సి ఉంటుంది. అయితే బుధవారం జరిగిన మెగా కార్మికుడి సంఘటనలో ఆ సంస్థ కార్మికుడి కుటుంబానికి కేవలం రూ.లక్ష మాత్రమే పరిహారంగా ఇచ్చి చేతులు దులుపుకున్నట్లు సమాచారం.

తక్షణ పరిహారం రూ.25 లక్షలివ్వాలి

పెనగడం గురవయ్య
సిఐటియు జిల్లా కార్యదర్శి

కేంద్రంలో మోడీ సర్కారు కొలువు దీరిన నాటి నుంచి కార్మిక చట్టాలు నిర్వీర్యమైపోగా, కార్పొరేట్ శక్తులు బలపడిపోయాయి. తద్వారా కార్మికులకు సరైన న్యాయం జరగడం లేదు. విధుల్లో ఉండగానే మెగా సంస్థలో పనిచేస్తున్న ఎంతోమంది కార్మికులు ప్రమాదవశాత్తు మరణించారు. ఆ విషయాలను ఆ సంస్థ బయటకు పొక్కనీకుండా దాచిపెడుతోంది. కార్మికుల చేత గొడ్డు చాకిరీ చేయించుకుంటూ కనీస వేతనం కూడా ఇవ్వడం లేదు. గుండెపోటుతో మరణించిన ఒరిస్సా కార్మికుడు సుభాష్ చంద్ర కుటుంబానికి మెగా సంస్థ తక్షణ పరిహారంగా రూ.25 లక్షలివ్వాలి.

4న 'ఏపీ 175' చిత్రం విడుదల



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఈ ఏడాది జూన్ 4న "ఏపీ 175" చిత్రం విడుదల కానుంది. నిర్మాణ సహకారం- రాష్ట్ర ప్రజలు, దర్శకత్వం - కేంద్ర ఎన్నికల సంఘం, సహ దర్శకత్వం -రాష్ట్ర ఎన్నికల సంఘం, పర్యవేక్షణ - పోలీసులు, ఎన్నికల అధికారులు, హీరోలు, విలన్లు - రాజకీయ నాయకులు, స్టంట్ మాస్టర్లు - రాజకీయ నాయకులు, కార్యకర్తలు, బాధితులు - ప్రజలు, శాంతిభద్రతల పర్యవేక్షణ - పోలీసులు, గెలిచేది - నాయకులు, ఓడేది- ప్రజలు. ఏ భాషకు సంబంధించిన సినిమా (చిత్రం) అయినా విడుదల కావాలంటే ముందుగా చిత్రీకరణ పూర్తి చేసుకోవాలి. ఎడిటింగ్, మ్యూజిక్ కంపోజింగ్, డబ్బింగ్ తదితర సాంకేతిక సహకారం తర్వాత మంచి ముహూర్తంలో చిత్రం విడుదలవుతుంది. సినిమా హిట్టా.. ఫట్టా అనేది ప్రేక్షకులు తేల్చాలి. పాతకాలంలో అయితే సినిమా 100 రోజులు, 200 రోజులు, 365 రోజులు ఆడిన సందర్భాలు కూడా ఉన్నాయి. అదేవిధంగా ఈనెల 13వ తేదీన జరిగిన "ఏపీ 175 ఎన్నికలు" అనే చిత్రం ఒకే రోజు షూటింగ్ పూర్తి చేసుకుంది. కొన్ని అవాంతరాలు, రాళ్లు, రాడ్లు, కర్రల యుద్ధాలు జరిగినా... తలలు పగిలినా... రక్తం కారినా చిత్రీకరణ మాత్రం ఆగలేదు. సినిమాల్లో లాగానే అన్నీ అయిపోయిన తర్వాత పోలీసులు రావడం.. నానా హంగామా చేయడం.. కేసులు కట్టడం చకచకా జరిగి పోయాయి. సినిమా లాగా కాకుండా "ఏపీ 175" సినిమా ఐదు సంవత్సరాలు ఆడాల్సిందే. ప్రేక్షకుల ఆదరణ ఉన్నా... లేకపోయినా చిత్రం పేరు పలకాల్సిందే. హిట్ అయినా ఫట్టయినా భరించాల్సిందే. ఎందుకంటే ప్రజలు ఏరి కోరి ఎన్నుకున్న నాయకత్వం, ప్రభుత్వం కాబట్టి.

వేరుశనగ విత్తనాలు పంపిణీ



బైరెడ్డిపల్లిలో వేరుశనగ విత్తనాలు పంపిణీ చేస్తున్న వ్యవసాయాధికారి గీత

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వేరుశనగ సబ్సిడీ విత్తనాల కొరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఎస్ఆర్ పురం మండలంలోని నెలవాయి , 49 కొత్తపల్లి మిట్ట రైతు భరోసా కేంద్రాల్లో గురువారం నగరి సహాయ వ్యవసాయ సంచారకులు సౌభాగ్య లక్ష్మి, వ్యవసాయ అధికారి నర్మదా సందర్శించారు. ఆమె మాట్లాడుతూ.. ఖరీఫ్‌లో వేరుశెనగ పంటలు వేసుకోవడానికి అనుకూలమని రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందిస్తున్న సబ్సిడీ వేరుశనగ విత్తనాలు గురువారం నుంచి రైతు భరోసా కేంద్రాలలో రిజిస్ట్రేషన్లు ప్రారంభమైందని ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో శివకుమార్, ప్రియ, ధనలక్ష్మి, మునినాదయ్య, నరేంద్ర పాల్గొన్నారు.

గుడిపల్లి: మండలంలోని రైతు భరోసా కేంద్రాలలో గురువారం వేరుశనగ విత్తనాల పంపిణీ కార్యక్రమం గురువారం ప్రారంభించడం జరిగిందని మండల వ్యవసాయ అధికారి నాగరాజు తెలిపారు. మండలంలో ఖరీఫ్ సీజన్‌కు గాను 540 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని రైతులు మొబైల్ నెంబర్, ఆధార్, పట్టాదారు పాసుపుస్తకం, 1బి జిరాక్సులతో వచ్చి రిజిస్టర్ చేసుకుని సబ్సిడీ విత్తనాలను తీసుకోవాలని తెలిపారు.

సదుం: మండల పరిధిలోని అన్ని రైతు భరోసా కేంద్రాలలో గురువారం 572.6 క్వింటాళ్ళు వేరు శెనగ విత్తనాలు పంపిణీ చేసినట్లు వ్యవసాయ అధికారి హరిప్రసాద్ గురువారం తెలిపారు.

బైరెడ్డిపల్లి: మండల పరిధిలో ఉన్న 18 రైతు భరోసా కేంద్రాల్లో మండల వ్యవసాయ అధికారి గీత ఆధ్వర్యంలో వేరుశనగ విత్తనాలు పంపిణీ కార్యక్రమం గురువారం నిర్వహించారు. తహశీల్దార్ స్వర్ణలత, ఎంపీడీవో రాజేష్ రైతులకు విత్తనాలు అందజేశారు.

రామకుప్పం: మండలంలో వేరుశనగ విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని తహశీల్దార్ శ్రీధర్, ఎంపీడీవో ఈశ్వరయ్య పేర్కొన్నారు. గురువారం రామకుప్పం గ్రామ సచివాలయంలో రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ ద్వారా 1710 రూపాయలకు 30 కేజీల బస్తా ఇవ్వడం జరుగుతుందన్నారు. ఏఓ అమత, ఆనంద్, యువరాజ్ పాల్గొన్నారు.

వెదురు కుప్పం: ప్రభుత్వం రైతులకు రాయితీపై అందిస్తున్న వేరుశెనగ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారిణి హేమలత అన్నారు. గురువారం మండల కేంద్రంలోని సచివాయంలో వేరుశెనగ విత్తనాలను పంపిణీ చేశారు. ఏఈవోలు గాయత్రి, హేమాద్రి. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తవణంపల్లి: మండల పరిధిలో గురువారం రైతు భరోసా కేంద్రాల్లో విత్తనం పంపిణీ కొరకు రిజిస్ట్రేషన్ ప్రారంభించినట్లు ఏవో ప్రవీణ్ తెలిపారు. మండలంలోని రైతు భరోసా కేంద్రాల్లో విత్తనం పంపిణీ దశలవారీగా ప్రారంభిస్తున్నట్లు ఏవో తెలిపారు.

శాంతిపురం: మండలంలోని 6 రైతుభరోసా కేంద్రాల్లో గురువారం 1268 మంది రైతులకు 458 క్వింటలు విత్తనాలు అందించినట్లు వ్యవసాయ అధికారి అప్పోజీ తెలిపారు.

సోమల: మండలంలోని రైతు భరోసా కేంద్రాలలో గురువారం రాయితీ వేరుశనగ విత్తనాలను ఆర్బికే సిబ్బంది ఆధ్వర్యంలో రైతులకు పంపిణీ చేశారు. మొదటిరోజు 1867 మంది రైతులు రాయితీ వేరుశనగ విత్తనాల కోసం రాగా 887.70 క్వింటాళ్ల రాయితీ వేరుశనగ విత్తనాలను పంపిణీ చేసినట్టు అధికారులు తెలిపారు.

రేపు డీఈవో నియామక పరీక్ష

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ విజయవాడ వారి ఆధ్వర్యంలో గెజిట్ నెంబర్ 14/2023 మేరకు డిప్యూటీ ఎడ్యుకేషనల్ అధికారుల నియామకం కొరకు కంప్యూటర్ బేస్డ్ స్క్రీనింగ్ పరీక్షలు (ఆబ్జెక్టివ్ తరహా) చిత్తూరు జిల్లాలో ఈనెల 25వ తేదీ నిర్వహించ బడునని జిల్లా కలెక్టర్ ఎస్.షణ్మోహన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చిత్తూరు జిల్లాలో ఈనెల 25న డిప్యూటీ ఎడ్యుకేషనల్ అధికారుల నియామకం కొరకు మూడు పరీక్షాకేంద్రాలలో పరీక్షలు ఆబ్జెక్టివ్ తరహాలో నిర్వహించబడునని జిల్లా కేంద్రంలో సీతమ్స్ కళాశాల, పూతలపట్టు - వేము ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, గంగవరం- మదర్‌థెరిసా ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్ టెక్నాలజీలో ఉదయం 9 నుండి 11.30గంటల మధ్య ఆబ్జెక్టివ్ తరహాలో పరీక్షలు నిర్వహించబడునని, అభ్యర్థులు ఉదయం 7 గంటల నుండి 8.30 గంటల లోపు మాత్రమే పరీక్షా కేంద్రంలోనికి అనుమతించడం జరుగుతుందన్నారు. ఒక్క క్షణం ఆలస్యమైనా అనుమతించడం జరగదని ఈవిషయాన్ని అభ్యర్థులు అందరూ గమనించాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

పెట్రోలు, డీజిల్ లూస్ అమ్మకాలు నిషిద్ధం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

చిత్తూరు జిల్లాలో ఎక్కడ కూడా పెట్రోల్, డీజిల్ అక్రమంగా అమ్మకాలు జరగకూడదని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, మండల తహశీల్దార్లు, ఎంపీడీఓలు, ఈవోపీఆర్డీలు, పంచాయతీ సెక్రటరీలు, వీఆర్వోలు, మహిళా పోలీసులతో అర్బన్, గ్రామీణ ప్రాంతాలలో అక్రమంగా పెట్రోల్, డీజిల్ అమ్మకాల నిషేధంపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడా అక్రమంగా పెట్రోల్, డీజిల్ అమ్మకాలు జరగకుండా ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు ఈవోపీఆర్డీలు, పంచాయతీ సెక్రటరీలు మహిళా పోలీసులు నిఘా పెట్టాలన్నారు. పెట్రోల్ బంకులను ఆర్డీఓలు, తహశీల్దార్లు పరిశీలించాలని, అలాగే ఎవరికీ క్యాన్స్, బాటిల్స్ డ్రమ్స్‌లో పెట్రోల్, డీజల్ పట్టకూడదన్న సమాచారాన్ని అన్ని పెట్రోల్ బంక్ యజమానులకు తెలియజేయాలని అన్నారు. పౌరసరఫరాల శాఖ ద్వారా పంపిణీ చేసే నిత్యావసర వస్తువుల స్టాక్ పాయింట్లను పరిశీలించని ఆర్డీఓలు రెండు రోజులలోగా పరిశీలించాలని ఆర్డీఓలను ఆదేశించారు. మండలంలో సగభాగం తహశీల్దార్ల, సగభాగం ఎంపీడీఓలు పెట్రోల్ బంకులను పరిశీలించాలని, అర్బన్ పరిధిలో మున్సిపల్ కమిషనర్లు డిప్యూటీ తహశీల్దార్‌తో కలిసి ఇల్లీగల్‌గా పెట్రోల్, డీజిల్ అమ్మకాలు జరుగుతుంటే గుర్తించి సీజ్ చేయాలని అక్కడున్న స్టాకును పౌరసరఫరాల శాఖకు అందజేయాలన్నారు. బ్యాంకులకు, సెల్ టవర్స్ , పవర్ లూమ్స్ ఆసుపత్రులకు జనరేటర్లకు అవసరం మేరకు వారు సంబందించిన తహశీల్దార్లను సంప్రదించిన ఎడలవారి అవసరాన్ని బట్టి వారికి సంబందిత పెట్రోల్ బ్యాంకులకు లెటర్ ఇవ్వాలని తహశీల్దార్లను ఆదేశించారు. మండల స్థాయిలో షెడ్యూల్ ప్రకారంగా నిర్వహించే జనరల్ బాడీ సమావేశాలకు సంబంధించి ముందుగానే స్థానిక ఎస్‌హెచ్‌ఓలకు సమాచారం ఇవ్వాలని ఎంపీడీఓలను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ నుండి డిఎస్‌ఓ శంకరన్, ఏఎస్‌ఓ శివరామరాజు, తదితరులు పాల్గొన్నారు.

దుకాణదారులకు నోటీసులు జారీ

నగర పరిధిలో పెట్రోల్ బంకులు, ఇతర దుకాణాల్లో పెట్రోల్, డీజిల్ లూస్‌గా, క్యాన్లు, బాటిళ్లలో విక్రయించవద్దని నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ స్పష్టం చేశారు. రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ వారి ఆదేశాల మేరకు నగరంలో 21 పెట్రోల్ బంకులకు బుధవారమే నోటీసులు జారీ చేసినట్లు చెప్పారు. బంకుల్లో ఎక్కడ విడిగా బాటిల్లు, క్యాన్లలో పెట్రోల్, డీజిల్ పట్టరాదని హెచ్చరించారు. నిబంధనలను మీరి నడుచుకుంటే చట్ట ప్రకారం చర్యలు కఠినంగా ఉంటాయన్నారు. గురువారం నగర పరిధిలోని ఇతర దుకాణాల్లోనూ నగర పాలక రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ అధికారుల ఆధ్వర్యంలో విస్తతంగా తనిఖీలు చేపట్టారు. పెట్రోలు బాటిళ్లు కలిగిన దుకాణాదారులకు నోటీసులు ఇవ్వడంతో పాటు, సదరు పెట్రోల్ బాటిలను స్వాధీనం చేసుకున్నారు. పెట్రోల్, డీజిల్‌లను బాటిళ్లలో విక్రయించబోమని సదరు దుకాణదారుల నుంచి డిక్లరేషన్ తీసుకున్నారు. డిక్లరేషన్ అతిక్రమించి పెట్రోల్, డీజిల్ విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

కౌంటింగ్ ఏర్పాట్లు కట్టుదిట్టం

ప్రజాశక్తి - తిరుపతి సిటి, రామచంద్రాపురం

కౌంటింగ్ సన్నద్ధత ఏర్పాట్లు కట్టుదిట్టంగా చేపడుతున్నామని జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా వర్చువల్ విధానంలో సమీక్షించారు. తిరుపతి జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ సజావుగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కౌంటింగ్ సూపర్వైజర్లు, కౌంటింగ్ సహాయకులు, మైక్రో అబ్జర్వర్లు కు విధుల కేటాయింపు కొరకు ఫస్ట్ ర్యాండమైజేషన్ ఈనెల మే26న, రెండవ రాండమైజేషన్ జూన్ 3 తారీఖున అబ్జర్వర్ సమక్షంలో చేపడతామన్నారు. 22న బుధవారం కౌంటింగ్ విధులకు హాజరయ్యే సిబ్బందికి మొదటి దశ శిక్షణ ఇచ్చామన్నారు. 90 సీసీ కెమెరాలు ఏర్పాటుతో, స్ట్రాంగ్ రూము దాని చుట్టుపక్కల పరిసర ప్రాంతాలు కవర్ అయ్యేలా ఏర్పాటు చేశామని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు నాలుగో తేదీన సాయంత్రం నాలుగు కల్లా పూర్తయ్యేలా ఏర్పాట్లు చేపడుతున్నామని, ఈవీఎం కంట్రోల్ యూనిట్ల ఓట్ల లెక్కింపు కూడా ఆలోపు పూర్తి చేస్తామని తదనుగునంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. తిరుపతి పార్లమెంటు నియోజక వర్గ పోస్టల్ బ్యాలెట్ 15 టేబుల్ ఏర్పాటుతో 3 రౌండ్లలో పూర్తి చేసేలా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

సెల్‌ఫోన్, ఎలక్ట్రానిక్ గాడ్జెట్‌కు అనుమతి లేదు

కంట్రోల్ రూం నందు సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేశామని, స్ట్రాంగ్ రూంలను ప్రతి రోజూ అభ్యర్థులు లేదా వారి ఏజెంట్లు పరిశీలించవచ్చని, స్ట్రాంగ్ రూంలను ప్రతి రోజూ అభ్యర్థులు లేదా వారి ఏజెంట్లు పరిశీలించే ఏర్పాటు చేశామని, కౌంటింగ్ కేంద్రంలోనికి సెల్ ఫోన్, ఎలక్ట్రానిక్ గాడ్జెట్ లు అనుమతి లేదని, హింసాత్మక చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదన్నారు. గురువారం రాజకీయ పార్టీల నాయకులు, పోటీలోని అభ్యర్థుల సమావేశం స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు నిర్వహించారు. ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ నిర్వహణకు అన్ని రాజకీయ పార్టీల అభ్యర్థులు సహకరించాలని, కౌంటింగ్ పూర్తి అయిన తర్వాత ఎలాంటి ర్యాలీలు విజయోత్సవ సభలు సమావేశాలు నిర్వహించరాదని తెలిపారు. డిఆర్‌ఓ పెంచల కిషోర్ పాల్గొన్నారు.



సమస్యలు తలెత్తకుండా చూడాలి : ఆరణి శ్రీనివాసులు

జూన్4న జరిగే కౌంటింగ్‌లో ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎన్‌డిఎ కూటమి ఎంఎల్‌ఎ అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు అన్నారు. గురువారం స్ట్రాంగ్‌రూమ్‌ను పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. ఫేక్ న్యూస్ ప్రచారం చేస్తున్న వారిపై సైబర్ క్రైం అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జనరల్ ఏజెంట్ మహేష్ యాదవ్ పాల్గొన్నారు.

హింసాత్మక ఘటనలకు పాల్పడితే చర్యలు : ఎస్‌పి

సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎవరైనా హింసాత్మక ఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తిరుపతి జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు తెలిపారు. హింసాత్మక ఘటనలతో జిల్లా పోలీసులు అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తుగా హై అలర్ట్ అయ్యారు. గురువారం చంద్రగిరి నియోజకవర్గంలోని రామచంద్రపురం మండలం, చుట్టుగుంట



135 సమస్యాత్మక ప్రాంతాలు గుర్తింపు
హింసాత్మక ఘటనలకు పాల్పడొద్దు

రామాపురం గ్రామాన్ని ఎస్పీ హర్షవర్ధన్ రాజు, ట్రైనింగ్ ఎస్పి దేవరాజ్, అడిషనల్ ఎస్పీ కులశేఖర్, డీఎస్పీలు రవీందర్ రెడ్డి, శరత్ రాజ్ కుమార్ లు సందర్శించి సమస్యాత్మక కేంద్రాలను గుర్తించి, దిగువ రామాపురం, ఎగువ రామాపురం గ్రామాలలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐ శేఖర్, స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్ మదన్మోహన్, హెడ్ కానిస్టేబుల్ సురేష్, యోబు, సిబ్బంది త్యాగరాజు, ధనుంజయులు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

135 సమస్యాత్మక ప్రాంతాలు

కౌంటింగ్ రోజు అందరూ క్రమశిక్షణతో మెలిగి పోలీస్ వారికి సహకరించి ఎలాంటి ఘటనలు జరగకుండా ఉండాలని ఎస్‌పి సూచించారు. తిరుపతి జిల్లాలో 135 సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి పోలీస్ పికెట్లను ఏర్పాటు చేసి, నిరంతరం నిఘా ఉంచామన్నారు. అలాగే 3 మాబ్ కంట్రోల్ టీం లను ఏర్పాటు చేశామన్నారు. ఓట్ల లెక్కింపు బందోబస్తుకు దాదాపు 1500 మంది పోలీసులు, 2 కంపెనీల కేంద్ర సాయుధ బలగాలు, కొన్ని ఏపీఎస్పీ ప్లటున్లు సిద్ధంగా ఉన్నాయన్నారు.

క్రైం న్యూస్

బిసివైపి మహిళా కార్యకర్త పై దాడి

- ఐదుగురు నిందితులు అరెస్టు - కేసు దర్యాప్తు చేపట్టిన డీఎస్పీ



ప్రజాశక్తి- పుంగనూరు: మండలంలోని ఎంసీ పల్లి పంచాయతీ బర్నేపల్లి గ్రామానికి చెందిన శంకర భార్య అంజమ్మ బుధవారం రాత్రి అదే గ్రామానికి చెందిన వైసిపి నాయకులు కొందరు దౌర్జన్యంగా ఇంటిలోకి వెళ్లి కత్తితో దాడి చేశారు. అంజమ్మకు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు హుటాహుటిన ఆమెను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అంజమ్మ భర్త శంకర బీసీవైపార్టీ సదుం మండలంలో ప్రచారం నిర్వహించినప్పుడు గొడుగులు చేశారని గత సోమవారం అరెస్టు చేశారు. ఇంటిలో భర్త లేని విషయం తెలుసుకొని అదే గ్రామానికి చెందిన చంద్రశేఖర్, పురుషోత్తం, మంజుల, చంద్రకళ, శంకరమ్మ ఇంట్లోకి వెళ్లి ఆమెపై విచక్షణ రహితంగా దాడి చేసి గాయపరిచారని అంజమ్మ మీడియాకు తెలిపింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. డీఎస్పీ రఘువీర ప్రసాద్ గ్రామాన్ని సందర్శించి గ్రామస్తులు చెప్పిన ఆధారాలు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. అంజమ్మ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నది.

అతిసారా లక్షణాలతో మహిళ మృతి

గ్రామంలో పర్యటించిన జిల్లా అధికారులు
ముమ్మరంగా పారిశుధ్య పనులు
కొనసాగుతున్న వైద్య శిబిరాలు

ప్రజాశక్తి- శాంతిపురం: మండల పరిధిలోని నడింపల్లి గ్రామంలో అతిసారా వ్యాధి కారణంగా ఓ వృద్ధురాలు మతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. గత మూడు రోజులుగా గ్రామంలోని చిన్నారులు, పెద్దలు వాంతులు వీరేచణాలుతో బాధపడుతూ అస్వస్థతకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన మునియమ్మ (80) అతిసారా లక్షణాలతో మతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ విషయమై మెడికల్ ఆఫీసర్ శివకుమారిని వివరణ కోరగా మునెమ్మ వయోభారంతో దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నందువలన మతి చెందినట్లు తెలిపారు. వైద్య శిబిరం ఏర్పాటుచేసి ఉన్న వారిని గుర్తించి వారికి వైద్య శిక్షణ అందించినట్లు ఆమె తెలిపారు. గురువారం కొత్తగా 6 కేసులు నమోదైనట్లు ఆమె చెప్పారు.

మహిళ అదృశ్యం

తల్లిదండ్రులకు అప్పగింత

ప్రజాశక్తి- సోమల

సోమల మండలం బాలప్పగారిపల్లె గ్రామానికి చెందిన వెంకటరమణ కుమార్తె గౌరీ (22) కనిపించడం లేదంటూ పోలీసులకు రెండురోజుల క్రితం ఫిర్యాదు రావడంతో గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు చివరకు చిత్తూరు సమీపంలో బంధువుల ఇంటిలో ఉన్నట్లు గుర్తించారు. అనంతరం సోమలకు తీసుకువచ్చి తహశీల్దార్ నాగరాజు సమక్షంలో తల్లిదండ్రులకు అప్పగించినట్లు ఎస్సై వెంకట నరసింహులు తెలిపారు.

ఆకట్టుకున్న శ్రీకృష్ణ జననం హరికథ

ప్రజాశక్తి - ఎస్‌ఆర్ పురం

మండలం తయ్యూరు పాయకట్టు అంకనపల్లి మహాభారతంలో గురువారం సాయంత్రం నాలుగు గంటలకు హరికథలలో శ్రీకృష్ణ జననం కార్యక్రమాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో... కన్నులకు పండుగగా... కట్టినట్లు... స్థానిక యోగ ఆచార్యులు గోవిందస్వామి నాయుడు దంపతులు, అంకనపల్లి గ్రామస్తులు తయ్యూరు పాయకట్టు భక్తాదులు కలసి నిర్వహించారు. భాగవతారని కౌసల్య హరికథాగానం మధ్య, భక్తిశ్రద్ధలతో బాలకృష్ణుని ఉయ్యాలలోపుతూ శ్రీకృష్ణ జన్మ ఘట్టం కళ్లకు కట్టినట్టు చూపించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు శ్రీకష్ణ అత్యంతలు ఆశీర్వాదాలు ఇచ్చారు. ఆలయ ధర్మకర్త లింగారెడ్డి, రామనాథరెడ్డి, పురుషోత్తంశెట్టి, డిసెంబర్ శెట్టి, దామోదర చారి పాల్గొన్నారు.

'మధర్ థెరిసా' లో క్రికెట్ టోర్నమెంట్



ప్రజాశక్తి- గంగవరం: మండలంలోని మధర్ థెరిసా ఇంజినీరింగ్ కళాశాలలో నేటి నుండి మూడు రోజులపాటు క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు కళాశాల అకడమిక్ అడ్వైజర్ రాజేంద్రరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతలో క్రీడాస్ఫూర్తిని నింపడానికి నేటి నుంచి మూడు రోజులపాటు క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలలో అనంతపురం, వైఎస్సార్ కడప, కర్నూలు, చిత్తూరు తదితర జిల్లాలోని విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. కనుక క్రికెట్‌లో నైపుణ్యం ఉన్న క్రీడాకారులను ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

నేత్ర పర్వంగా 'కంచి గరుడసేవ'



ప్రజాశక్తి- చిత్తూరు డెస్క్: పట్టణ పరిధిలోని తిరుమల తిరుపతి దేవస్థానం ఆధీనంలో ఉన్న శ్రీదేవీ భూదేవి సమేత కరియమాణిక్య స్వామి ఆలయంలో గురువారం కంచి గరుడసేవ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. నేత్రపర్వంగా అలంకరించిన గరుడ వాహనంపై దేదీప్యమానంగా కరియ మాణిక్యస్వామిని మాడవీధుల్లో ఊరేగించారు. తిరుమల దేవస్థానం వారు ఏర్పాటు చేసిన సాంస్కతిక కార్యక్రమాలు అలరించాయి. ఉదయం ఆలయం నుండి ప్రారంభమైన గరుడ వాహనం కోలాటాలు, భజన బృందాలు, వేద పారాయణాలు, మంగళ వాయిద్యాలు, కళాకారుల నృత్యప్రదర్శనలతో స్వామివారు గరుడ వాహనంపై మాడవీధులందు విహరించారు. నగరి పోలీసు శాఖ వారు, మున్సిపల్ శాఖ, టీటీడీ ఆలయ సెక్యూరిటీ సిబ్బంది పర్యవేక్షణా బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ఆలయాల డిప్యూటీ ఈవో నాగరత్నం, ఏఈఓ పార్థసారథి, సూపరింటెండెంట్ సోమశేఖర్, ఆలయ అధికారులు వెంకటరమణ, గుణశేఖర్, జానకి రామ్, ఎస్‌ఎస్‌ఎస్ సూపర్వైజర్ వెంకటేశ్వర్లు, ప్రధాన అర్చకులు నరసింహప్రసాద్, ధన్వంతరి ఆచార్యులు, బాలాజీ ఆచార్యులు, స్థానిక సలహా సభ్యులు పాల్గొన్నారు

విద్యార్థులకు చిత్రలేఖనంలో శిక్షణ



ప్రజాశక్తి- వెదురు కుప్పం/ కార్వేటినగరం: విద్యార్థులు చిత్రలేఖనంపై అవగాహన కలిగి ఉండాలని విశ్రాంతి డ్రాయింగ్ మాస్టర్ సుబ్రమణ్యం అన్నారు. గ్రంధాలయ వేసవి శిక్షణలో భాగంగా గురువారం విద్యార్థులకు చిత్రలేఖనంపై కల్పించి శిక్షణ ఇచ్చారు. బొమ్మలు గీయడానికి కొన్ని మెళుకువలు పాటిస్తే ఆ బొమ్మ అందంగా కనిపిస్తుందని అన్నారు. జాతీ పక్షి నెమలి బొమ్మను గీయడం విద్యార్థులందరికీ నేర్పించారు. విద్యార్థులు బొమ్మలు గీయడం వల్ల వారి చేతి నైపుణ్యత బహిర్గతమవుతుందని చెప్పారు. గ్రంధాలయ అధికారి శంకర్‌బాబు, రాఘవేంద్రరాజు, శేషాద్రి, యుగంధర్ పాల్గొన్నారు.

నారసింహనపల్లిలో 'మహాభారతం'

ప్రజాశక్తి- తవణంపల్లి: భావితరాలకు భారతదేశ సంస్కృతి, చరిత్రను తెలియజేయడానికి మహభారత యజ్ఞాలు ఎంతో దోహదపడతాయని మండలం వైసిపి కన్వీనర్ సిపి.హరిరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని నారసింహనపల్లి గ్రామంలో మహభారత హరికథ యజ్ఞం నిర్వహించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు పూర్ణమోహన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం

ప్రజాశక్తి- వెదురుకుప్పం/ కార్వేటినగరం: రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వద్ధాశ్రమంలోని వృద్ధులకు జీడీనెల్లూరు వైఎస్సార్సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కళత్తూరు కపాలక్ష్మి కుమారుడు భువన్‌తేజ్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని గురువారం అన్నదానం నిర్వహించారు. వృద్ధాశ్రమంలో స్వీట్లు, పళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాస్ కోఆర్డినేటర్ ప్రకాష్, వద్దులు పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ

పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి సయ్యద్ మౌలా

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:



ఈనెల 24వ తేదీ శుక్రవారం నుంచి నిర్వహించనున్న ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చిత్తూరు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి (డిఐఈఓ) సయ్యద్ మౌలా స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన గురువారం మధ్యాహ్నం చిత్తూరు నగరంలోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఈనెల 24వ తేదీ నుండి ఈనెల 31వ తేదీ వరకు చిత్తూరు జిల్లా వ్యాప్తంగా మొత్తం 31కేంద్రాల్లో ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఏడాది 7,742 మంది ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులతో పాటు 2,577 మంది ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షలకు హాజరు కానున్నట్లు తెలిపారు. మొదటి సంవత్సరం విద్యార్థులు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు పరీక్షలు రాయనున్నట్లు వివరించారు. అయితే పరీక్షలకు హాజరయ్యే మొదటి, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు నిర్ధారిత సమయం కంటే అరగంట ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు. అదే క్రమంలో విద్యార్థులు ఎటువంటి ఒత్తిడిలకు లోను కాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సూచించారు. అన్ని శాఖల సమన్వయంతో ఆయా పరీక్ష కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేశామని డిఐఈఓ తెలిపారు.

భ్రూణ హత్యలను నివారించండి



ప్రజాశక్తి -తిరుపతి సిటీ : జిల్లాలో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టమును పటిష్టంగా అమలు చేయాలని, ఉల్లంఘన చర్యలకు పాల్పడిన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని కలెక్టర్, జిల్లా మెజిస్ట్రేట్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. గురువారం స్థానిక కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టం అమలుపై జిల్లా స్థాయి అడ్వైజరీ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో స్త్రీ పురుషులు ఇద్దరూ సమానమేనని, ఆడపిల్లల పట్ల వివక్షత ఉండకూడదని తెలిపారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టాన్ని కఠినంగా అమలు చేయడం ద్వారా భ్రూణ హత్యలను నివారించవచ్చని అన్నారు. జిల్లాలో ప్రతి నెలా అన్ని స్కానింగ్ కేంద్రాలలో డాక్టర్లు తనిఖీలు నిర్వహించాలన్నారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలకు పాల్పడుతున్న స్కానింగ్ సెంటర్ల వారి రిజిస్ట్రేషన్ తొలగించడం జరుగుతుందని అన్నారు. స్కానింగ్ సెంటర్లో రిజిస్ట్రేషన్, రెన్యువల్, ఇతర మోడీఫికేషన్ దరఖాస్తులను ఆన్లైన్లో మాత్రమే స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. అల్ట్రా సౌండ్ స్కానింగ్ మిషన్ మార్చాలన్నా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ వారి అనుమతి తప్పనిసరిగా పొందాలని తెలిపారు. ఈ చట్టమును అతిక్రమించిన వారికి రూ.50వేల రూపాయలు జరిమానాతో బాటు, 3 సంవత్సరాల కఠినమైన శిక్ష లు ఉంటాయని తెలిపారు. జిల్లాలో 215 స్కానింగ్ సెంటర్స్ ఉన్నాయనీ తెలిపారు. లింగ నిర్ధారణ పరీక్షలు జరుగుతున్నాయని సమాచారం తెలిసినవారు 102, 104 టోల్ ఫ్రీ నెంబర్ కు కాల్ చేసి తెలియజేయవచ్చని తెలిపారు. డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీహరి, డిఐఓ శాంత కుమారి, దిశా డి.ఎస్.పి కాటమరాజు, గైనకాలజిస్ట్ డా. మాధవి, పీడియాట్రిస్ట్ డా. కిరిటి, రేడియాలజిస్ట్ డా. నాగేశ్వరరావు, డెమో బాబు నెహ్రు రెడ్డి, డిపిఎంఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఇంటర్మీడియట్ కోర్సులకు దరఖాస్తులు

ప్రజాశక్తి -సదుం: మండల పరిధిలోని మహాత్మాజ్యోతీ బాపులే రెసిడెన్సిల్ జూనియర్ కళాశాలలో 2024-25 సంవత్సరానికి గాను ఎంపిసి, బైపిసి గ్రూపులలో ప్రవేశం కొరకు పదవ తరగతి పాస్ అయిన విద్యార్థులు ఈ నెల 27వ తేదీ లోపల ధరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసులు రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

మొలకల పౌర్ణమి వేడుకలు

ప్రజాశక్తి- సోమల: మొలకల పౌర్ణమి పర్వదినం సందర్భంగా మండల కేంద్రమైన సోమల సమీపంలోని తిరుపతి రోడ్డు నందుగల శ్రీ పరుష వెంకటేశ్వర స్వామి వారి పాదాల గుడి వద్ద మొలకల పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ ఏడాది కొన్ని అనివార్య కారణాలవల్ల వేడుకలను పూర్తిస్థాయిలో నిర్వహించకుండా స్వామివారికి ప్రత్యేక పుష్పాలంకరణ అభిషేకం తీర్థప్రసాద వినియోగం నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు

స్మార్ట్ సిటీ పనులను వేగవంతం చేయాలి : కమిషనర్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

తిరుపతి స్మార్ట్ సిటీ కార్పొరేషన్ ద్వారా చేపట్టిన పనులను వేగవంతం చేయాలని కమిషనర్ అదితిసింగ్ అన్నారు. గురువారం స్మార్ట్ సిటీ అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు, పనులు చేపట్టిన కాంట్రాక్టర్లతో తిరుపతి స్మార్ట్ సిటీ ఎం.డి అదితి సింగ్ ఐఏఎస్ సమీక్షించారు. ఐట్రిపుల్ సి పనులు నెమ్మదిగా నడుస్తున్నాయని, పనులు వేగవంతం చేయాలన్నారు. కచ్చపి ఆర్ట్ బ్లాక్ వద్ద ఏర్పాటు చేయబోవు కమాండ్ కంట్రోల్ సెంటర్ పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. సిటీ ఆపరేషన్ సెంటర్ పనులపై సమీక్షిస్తూ పనుల వేగవంతంపై దష్టి సారించాలని, ముఖ్యంగా సిటిసి బిల్డింగ్ పూర్తి చేయడంతో మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయం ప్రజలకి అందుబాటులోకి వస్తుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. అదేవిధంగా మల్టి లెవల్ కార్ పార్కింగ్ పనులు, ఇతర పనుల స్థితి గతులపై చర్చించి పనుల వేగవంతానికి కాంట్రాక్టర్లు పని చేయాలని, నిర్మాణాల పనులపై అధికారులు దష్టి సారించాలని, ఎప్పటికప్పుడు జరుగుతున్న పనుల వివరాలను తనకు నివేదించాలని తిరుపతి స్మార్ట్ సిటీ కార్పొరేషన్ ఎం.డి, తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అదితి సింగ్ ఐఏఎస్ తెలిపారు. ఈ సమావేశంలో సూపరింటెండెంట్ ఇంజనీర్ తిరుమలిక మోహన్, అడిషనల్ కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, మునిసిపల్ ఇంజనీర్ చంద్రశేఖర్, డిఈఈ విజయకుమార్ రెడ్డి, ఏయికాం సంస్థ ప్రతినిధి భాలాజీ, ఆఫ్కాన్ సంస్థ ప్రతినిధి రంగస్వామి, మేనేజర్ చిట్టిబాబు, స్మార్ట్ సిటీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రొఫెసర్ గాయత్రికి ఫెలోషిప్ అవార్డు

ప్రజాశక్తి - తిరుపతి సిటి

స్విమ్స్ డిపార్టుమెంట్ ఎండోక్రైనాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ గాయత్రి అమెరికన్ అసోసియేషన్ ఆఫ్ క్లినికల్ ఎండోక్రినాలజీ ప్రతిష్టాత్మకమైన ఫెలోషిప్ అకడమిక్ ఎక్సలెన్స్ అవార్డును అందుకున్నట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ తెలిపారు. అవార్డును అందుకున్న ముగ్గురు భారతీయుల్లో స్విమ్స్ నుంచి ప్రొఫెసర్ గాయత్రి ఉండటం అభినందనీయమన్నారు. ఎండోక్రైనాలజీ డిపార్టుమెంట్ విభాగాధిపతి డాక్టర్ అలోక్‌సచన్ అభినందించారు.

నడక దినచర్యలో భాగమవ్వాలి : ఆరణి శ్రీనివాసులు

తిరుపతి టౌన్ : ఫిటెనెస్ ఉండాలన్నా, మానసిక ఒత్తిడిని జయించాలన్నా ప్రతి ఒక్కరూ నడకను తమ దినచర్యలో భాగం చేసుకోవాలని ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు కోరారు. ఆధునిక జీవన శైలి కారణంగా ఆహారపు అలవాట్లలో వచ్చిన మార్పులు వల్ల ఊబకాయం పెరిగి అనారోగ్యం కొని తెచ్చుకుంటున్నారని ఆయన అన్నారు. గురువారం ఉదయం బైరాగిపట్టెడలోని బాబు జగజ్జీవన్ రావు పార్క్ లో వాకర్స్ తో కలిసి నడిచారు. యువతతో పాటు సీనియర్ సిటిజెన్స్ ఉదయపు నడకలో భాగమయ్యారు. పలువురు వాకర్స్ ఎన్డీఏ కూటమి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులును గుర్తు పట్టి అప్యాయంగా పలకరించారు. అనంతరం బాబు జగజ్జీవన్ రామ్ వాకర్స్ అసోషియేషన్ ఏర్పాటు చేసిన మజ్జిగ ప్యాకెట్స్‌ను వాకర్స్ కు ఆరణి శ్రీనివాసులు అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్కాట్ కష్ణప్రసాద్, ఉదయగిరి రఘు, లీలాకష్ణమ నాయుడు, జయరాం పాల్గొన్నారు.

శెట్టిపల్లి మార్గంలో మతిస్థిమితం లేని వ్యక్తి వీరంగం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

మంగళం పరిధిలోని ఆర్టీవో కూడలి శెట్టిపల్లి మార్గంలో మతిస్థిమితం లేని యువకుడు అటుగా వచ్చే వాహనదారులను, పాదచారులపై రాళ్లు విసురుతూ గాయపరిస్తూ భయానక వాతావరణాన్ని కలిగించాడు. దాదాపు 11 మందిని రాళ్లతో దాడి చేయడంతో వారికి గాయాలయ్యాయి. అటుగా వెళ్లే వారంతా ఒక్కటై అతన్ని పట్టుకొని దారాలతో కట్టివేశారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించి వారికి అప్పగించారు.

ఘనంగా పాస్టర్ అరుల్ అరసు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి- తిరుపతి (మంగళం)

తిరుపతి నగర పరిధిలోని షకీనా చర్చి వ్యవస్థాపకులు పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షులు సీనియర్ పాస్టర్ అరుణ్ అరసు 60వ జన్మదిన వేడుకలను గురువారం నగర పరిధిలోని ఈస్ట్ లూథరన్ చర్చి ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొంతమంది పాస్టర్లు జన్మదిన వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. గత 47ఏళ్లుగా క్రైస్తవ ప్రార్థనలను అంకితభావంతో క్రైస్తవ సమాజానికి ఓ దిక్సూచిగా పాస్టర్ అరుల్ అరసు వ్యవహరించారన్నారు. ఆయన అనుసరించిన నిరాడంబర జీవనశైలి పలువురికి ఆదర్శంగా నిలుస్తుందన్నారు.

భక్తులను మోసగించిన ఔట్సోర్సింగ్ కార్మికులు

కేసు నమోదు చేసిన పోలీసులు

ప్రజాశక్తి -తిరుమల

యాత్రికులను టిటిడి ఒప్పంద కార్మికులు మోసం చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనపై టిటిడి విజిలెన్స్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజమండ్రికి చెందిన యాత్రికులకు స్వామివారి దర్శన టికెట్లు తీసిస్తామని లక్ష్మి శ్రీనివాస మాన్ పవర్ కార్పొరేషన్‌కు చెందిన ముగ్గురు సిబ్బంది రూ.20 వేలు తీసుకున్నారు. వారు దర్శన టికెట్లు ఇవ్వకపోవడంతో మోసపోయామని గ్రహించిన యాత్రికులు టిటిడి విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం సిబ్బంది పరారీలో ఉన్నారని, వారిని అదుపులోకి తీసుకుని బాధితులకు న్యాయం చేస్తామని టిటిడి విజిలెన్స్ అధికారులు తెలిపారు.

పులివర్తి నానిని విచారించిన పోలీసులు



ప్రజాశక్తి -తిరుపతి సిటీ : చంద్రగిరి టిడిపి కూటమి అభ్యర్థి పులివర్తి నానిని తిరుపతి డిఎస్పి రవి మనోహర్ ఆధ్వర్యంలో పోలీసులు గురువారం విచారణ నిర్వహించారు. ఎన్నికల పోలింగ్ మరుసటి రోజు శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని ఈవీఎం ఫ్యాడ్లు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ సమీపంలో పులివర్తి నాని పై హత్యాయత్నం జరిగిన విషయం విదితమే. చంద్రగిరి నియోజకవర్గంలో పోలింగ్ రోజు చంద్రగిరి మండలం రామ్ రెడ్డి గారి పల్లి పంచాయతి కూచువారిపల్లి గ్రామంలో జరిగిన అల్లర్లు, దాడులు, పద్మావతి మహిళ యూనివర్సిటీలో జరిగిన అల్లర్లపై ఎన్నికల సంఘం సీరియస్ కావడంతో, విచారణ కోసం సిట్ బందాన్ని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. తిరుపతి సిట్ బందానికి నేతత్వం వహిస్తున్న రవి మనోహర్ ఆచారి ప్రస్తుతం తిరుపతి డిఎస్పీగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో హత్యాయత్నం బాధితుడు పులివర్తి నానిని ఎస్వీయూ క్యాంపస్ పోలీస్ స్టేషన్ కి పిలిపించారు. మహిళా వర్సిటీ ఆవరణలో పులివర్తి నానిపై హత్యాయత్నం ఘటనపై విచారణ చేపట్టారు. అనంతరం నాని విలేకరులతో మాట్లాడుతూ తనపై జరిగిన హత్యాయత్నం ఘటనపై ఇప్పటికే పోలీసులకు పలు ఆధారాలతో వివరించానని, ఈ ఘటన కారకులపై తగిన చర్యలు తీసుకొని, తనకు న్యాయం చేయాలని కోరారు.

హైకోర్టులో చెవిరెడ్డికి చుక్కెదురు

చంద్రగిరి నియోజకవర్గంలో పోలింగ్ సందర్భంగా నాలుగు బూత్ లలో రిగ్గింగ్ జరిగిందని ఆరోపిస్తూ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. అయితే ఎన్నికల అధికారులు పోలింగ్ నాడు ఎలాంటి అవకతవకలు జరగలేదని నివేదిక సమర్పించంతో చెవిరెడ్డి పిటిషన్ ను ధర్మాసనం కొట్టివేసిందని తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని పేర్కొన్నారు. ఓటమి భయంతో దాడులు చేయించడం, అధికారులను బెదిరించడం, రి పోలింగ్ కోరడం పరిపాటిగా మారిందని ఆయన మండిపడ్డారు.